శంషాబాద్ ఎయిర్‌కార్గోకు గోల్డెన్ అవార్డు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 3: హైదరాబాద్ విమానాశ్రయానికి మరో అవార్డు వరించింది. శంషాబాద్ ఎయిర్‌కార్గోకు 'టైం క్రిటికల్ లాజిస్టిక్స్ సొల్యూషన్ ప్రొవైడర్ ఆఫ్ ది ఈయర్ విభాగంలో ప్రతిష్ఠాత్మక గోల్డెన్ అవార్డు లభించింది. చెన్నైలో జరిగిన 5వ సౌత్ ఈస్ట్ ఎయిర్‌కార్గో కాంక్లేవ్ అండ్ అవార్డు-2024లో ఈ అవార్డును కంపెనీ ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రపంచస్థాయి లాజిస్టిక్స్ పరిష్కరాలను అందించడంలో నిబద్ధతను పాటించడం వల్లనే ఈ అవార్డులు లభిస్తున్నాయన్నారు. ఈ అవార్డు రాకతో సంస్థపై అంతర్జాతీయ కస్టమర్లకు నమ్మకం పెరిగిందని, అలాగే మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడానికి నిధులు వెచ్చించనున్నట్లు చెప్పారు.

మూడోరోజూ లాభాల్లోనే..

ముంబై, డిసెంబర్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో సూచీలు కదంతొక్కాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 597.67 పాయింట్లు అందుకొని 80,845.75 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 181.10 పాయింట్లు అందుకొని 24,457.15 వద్ద నిలిచింది. అదానీ గ్రూపు షేర్లు క్రమంగా కోలుకుంటున్నాయి. స్టాక్ మార్కెట్లో లిస్టైన 11 సంస్థల్లో ఏడు కంపెనీలు లాభాల్లో ముగిశాయి. వీటితోపాటు ఎయిర్‌టెల్, ఐటీసీ, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, కొటక్ మహీంద్రాలు నష్టపోయాయి.

జీఎస్టీలో 35 శాతం శ్లాబ్!

త్వరలో పరిచయం చేసే దిశగా మోదీ సర్కారు అడుగులు

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్‌పై విధించే అవకాశం • 21న జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబుల్లో కొత్తగా మరొకటి రాబోతున్నదా? ఇప్పుడున్న 5, 12, 18, 28 శాతం శ్లాబులకుతోడు ప్రత్యేకంగా గరిష్ఠ శ్రేణిలో మరో శ్లాబు ఉండబోతున్నదా? అంటే.. అవుననే సమాధానాలే కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం.. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, వివిధ రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్‌పై 35 శాతం పన్ను వేయాలని ప్రతిపాదించింది మరి. ప్రస్తుతం ఇవన్నీ 28 శాతంలోనే ఉన్నాయి. ఇక సెస్సుతో కలిపితే పన్ను పోటు 57 శాతానికి చేరుతుండటం గమనార్హం. బీహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని మంత్రుల బృందం ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల సర్దుబాట్లపై తాజాగా సమావేశమైంది. ఈ క్రమంలోనే ఆరోగ్యానికి హానికరమైన, సమాజాన్ని పెడదోవ పట్టించేవాటిపై (సిన్ గూడ్స్) పన్నులను పెంచాలన్న నిర్ణయానికి సభ్యులు వచ్చారు.

21న నిర్ణయం?

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వంలో ఈ నెల 21న జరుగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రుల బృందం చేసిన ఈ సిఫార్సులు చర్చకు రానున్నాయి. ఆపై తుది నిర్ణయం తీసుకునే వీలున్నది. అయితే పన్ను వసూళ్లను పెంచడంలో భాగంగానే ఆయా వస్తూత్పత్తులపై ఈ ట్యాక్స్ రేట్ల సర్దుబాట్లు అని సమాచారం. దీంతో ఖజానాను నింపుకోవడానికి భవిష్యత్తులో మరిన్ని వస్తూత్పత్తులను ఈ హై రేంజ్ కేటగిరీలోకే మోదీ సర్కారు తెస్తుందా? అన్న అనుమానాలూ తలెత్తుతున్నాయి.

పన్ను రేట్ల సర్దుబాట్లు

దుస్తులు, మరికొన్నింటిపైనున్న జీఎస్టీ మార్పులపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ క్రమంలోనే విలువనుబట్టి రూ.1,500దాకా 5 శాతం, రూ.1,500-10,000 మధ్య 18 శాతం, రూ.10,000పైన 28 శాతం పన్నులు వేయాలని మంత్రుల బృందం నిర్ణయానికొచ్చినట్టు తెలుస్తున్నది. మొత్తం 148 వస్తూత్పత్తులు, సేవలపై ప్రస్తుతం పడుతున్న పన్ను రేట్లను సవరించాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. ఇప్పుడు అత్యధిక వస్తూత్పత్తులు, సేవలు 18 శాతం శ్లాబులోనే ఉన్న సంగతి విదితమే.

ఇటీ విధానం..

జీఎస్టీ విధానంలో నిత్యావసరాలకు పన్ను మినహాయింపు (0 శాతం) లేదా కనిష్ఠ శ్లాబు 5 శాతం పన్ను పడుతున్నది. అయితే లగ్జరీ, ఆరోగ్యానికి హాని కలిగించే, సమాజంపై చెడు ప్రభావం చూపే వాటిపై గరిష్ఠంగా 28 శాతం పన్ను ఉన్నది.

వీటిలో ఖరీదైన కార్లు, మోటర్‌సైకిళ్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు వంటి కన్స్యూమర్ డ్యూరబుల్స్, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, కొన్ని రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్, క్యాసినోలు, లాటరీ తదితర ఆన్‌లైన్ గేమ్స్ ఉన్నాయి. ఈ 28 శాతం పన్నుకు తోడు అదనంగా 22 శాతం సెస్సు కూడా ఉంటుంది. ఇక ప్రత్యేకంగా ముడి వజ్రాలు, రత్నాలపై పావు శాతం, బంగారంపై 3 శాతం జీఎస్టీ ఉన్నది.

2017 జూలై 1న జీఎస్టీని దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. వివిధ కేంద్ర, రాష్ట్ర పన్నులను కలిపి ఒకే దేశం, ఒకే పన్ను లక్ష్యంతో జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసింది. ఇందుకుగాను ఆదాయాన్ని నష్టపోతున్న రాష్ట్రాలకు పన్ను వసూళ్లలో వాటాలనూ ఇస్తున్నది.

రికార్డుస్థాయిలో ఎన్ఎండీసీ ఉత్పత్తి

హైదరాబాద్, డిసెంబర్ 3: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ రికార్డుస్థాయిలో ఉత్పత్తిని సాధించింది. నవంబర్ నెలకుగాను 4.51 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన 3.83 మిలియన్ టన్నులతో పోలిస్తే 18 శాతం అధికమైనట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 5.5 శాతం ఎగబాకి 4 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు కంపెనీ డైరెక్టర్(ఫైనాన్స్) అమితవ ముఖర్జీ తెలిపారు.

అప్రిలియా ఆర్ఎస్ 457 ధర పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: స్పోర్ట్స్ బైక్ అప్రిలియా ఆర్ఎస్ 457 ధరను రూ.10 వేలు పెంచుతున్నట్లు పియాజియో వెహికల్ సంస్థ ప్రకటించింది. పెరిగిన ధరలు జనవరి నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. ఇటాలియన్ పియాజియో గ్రూపునకు చెందిన బ్రాండే అప్రిలియా. ప్రస్తుతం ఈ స్పోర్ట్స్ బైకు రూ.4.2 లక్షల ప్రారంభ ధరతో లభిస్తున్నది.

ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌దే హవా

526 మిలియన్ చదరపు అడుగులు సొంతం

విలువ రూ.4.5 లక్షల కోట్లు: వెస్టియన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లకు చెందిన ఆఫీస్ స్పేస్ 526 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నదని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ మంగళవారం తెలిపింది. 'రీట్స్: రీషేపింగ్ ఇండియాస్ కమర్షియల్ స్పేస్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. ఈ స్టాక్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లుగా ప్రకటించింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా నగరాల్లో మొత్తం 884.1 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఏ కార్యాలయ స్థలాలున్నాయని వెస్టియన్ డాటా చెప్తున్నది. ఇందులో రీట్స్‌కు చెందినదే 526.3 మిలియన్ చదరపు అడుగులని, దీని విలువ రూ.4.5 లక్షల కోట్లు అని స్పష్టం చేసింది. దీనిలో స్టాక్ మార్కెట్లలో నమోదైన రీట్స్‌ల్లో మూడింటికి చెందినదే 110.7 మిలియన్ చదరపు అడుగులుగా ఉందని వివరించింది.

హైదరాబాద్ టాప్

ఆయా నగరాలపరంగా చూస్తే.. హైదరాబాద్‌లోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో దాదాపు 74 శాతం రీట్స్ ఆధ్వర్యంలోని ఆఫీస్ స్పేసే కావడం గమనార్హం. అలాగే ముంబై, పుణెల్లో గల ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌కు చెందినదే 50 శాతం. అయితే ఈ విషయంలో 24 శాతంతో కోల్‌కతా ఆఖర్లో ఉన్నట్టు వెస్టియన్ తెలియజేసింది. ఇక ఈ ఏడు ప్రధాన నగరాల్లో రీట్స్ కున్న ఆఫీస్ స్పేస్‌లో 60 శాతానికిపైగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌ల లోనే ఉన్నది. ఇదిలావుంటే భారతీయ రీట్ సంస్థల్లో 4 మాత్రమే స్టాక్ మార్కెట్లలో నమోదయ్యాయని, వీటి ఆధ్వర్యంలో అటు రిటైల్, ఇటు ఆఫీస్ మార్కెట్లలోని స్పేస్ 125 మిలియన్ చదరపు అడుగులని వెస్టియన్ ఈ సందర్భంగా తెలిపింది.

- 2014లో రీట్స్ మొదలు.
- 2019లో స్టాక్ మార్కెట్లలోకి.
- ప్రస్తుతం 4 రీట్స్ ట్రేడ్ అవుతుండగా, వాటిలో బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ ఉన్నాయి.
- నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్‌కు రియల్ ఎస్టేట్ అసెట్స్ మాత్రమే ఉన్నాయి.

SUMADHURA

సుమధుర గ్రూపు లగ్జరీ ప్రాజెక్ట్

హైదరాబాద్,డిసెంబర్ 3: దక్షిణాదికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సుమధుర గ్రూపు..తాజాగా హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాజెక్టు పలైస్ రాయల్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఈ విలాసవంతమైన ప్రాజెక్టు ద్వారా రూ.2,500 కోట్ల ఆదాయం సమకూరవచ్చునని తెలిపింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సమీపంలో నిర్మించతలపెట్టిన పలైస్ రాయల్ ప్రాజెక్టును 7.35 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్నది. మూడు విభాగాల్లో నిర్మిస్తున్న ఈ 52 అంతస్తుల ఎత్తైన టవర్‌లో 4 లేదా 5 పడక గదులు కలిగిన 523 యూనిట్లను నెలకొల్పుతున్నది. ప్రస్తుతం నిర్మాణాలు ప్రారంభించిన ఈ ప్రాజెక్టును 2029 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు సుమధుర గ్రూపు సీఎండీ మధుసూధన్ తెలిపారు.

17 కోట్లకు విమాన ప్రయాణికులు!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేరుకునే అవకాశం: ఇక్రా అంచనా

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశీయంగా విమానాలు ఎక్కేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 7 శాతం నుంచి 10 శాతం వృద్ధితో 16.4 కోట్ల నుంచి 17 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. అలాగే విమానయాన సంస్థల నష్టాలు కూడా రూ.2-3 వేల కోట్ల స్థాయిలో ఉంటాయని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో విమాన ప్రయాణికులు 5.3 శాతం ఎగబాకి 7.93 కోట్లకు చేరుకున్నారు. అలాగే అంతర్జాతీయ ప్రయాణికులు 16.2 శాతం చొప్పున అధికమయ్యారు.

ఆశాజనకం విమాన రంగం

దేశీయ విమానయాన రంగంపై ఇక్రా ఆశాజనక వృద్ధిరేటును ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో వచ్చే ఏడాది ఈ రంగం నిలకడైన వృద్ధిని నమోదు చేసుకోనున్నదని పేర్కొంది. ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజల్ షా మాట్లాడుతూ..ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో విమానయాన రంగం రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల స్థాయిలో నష్టాలను నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అధిక ఇంధన ధరలతో ఇబ్బందులు పడిన విమానయాన సంస్థలు గడిచిన రెండేండ్లగా ధరలు తగ్గడంతో లాభాలు మెరుగుపరుచుకుంటున్నాయని, మరోవైపు నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి అధికప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. ఈ ఏడాది తొలి ఎనిమిది నెలల్లో కిలో లీటర్ విమాన ఇంధన ధరలు 6.8 శాతం తగ్గి రూ.96,192గా నమోదయ్యాయి. మొత్తం నిర్వహణ ఖర్చుల్లో ఇంధనకోసం పెట్టే ఖర్చు 30 శాతం నుంచి 40 శాతంగా ఉంటుండగా, మరో నిర్వహణ ఖర్చులు 35-50 శాతం స్థాయిలో ఉంటున్నాయని తెలిపింది. వీటిలో విమానాల నిర్వహణ, చమురు, ఇంజిన్ మెంటనెన్స్ కూడా ఉన్నాయి.

మామిడిపల్లి గ్రామంలో పత్తి చేనులో తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి

ఫెంగల్ తుఫాన్‌తో పరేషాన్

- కారుమబ్బులతో గుబులు
- కల్లాలోనే ధాన్యం, చేన్లలోనే పత్తిపంట
- తీవ్రనష్టం వాటిల్లుతోందని అన్నదాతల ఆందోళన

కోనరావుపేట, డిసెంబర్ 3: ఫెంగల్ తుఫాన్ రైతులను పరేషాన్ చేస్తున్నది. గత ఆదివారం నుంచే ఆకాశంలో కారుమబ్బులు ఏర్పడగా, మంగళవారం ముసురువానకురిసింది. ఈ క్రమంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండగా, చేతికొచ్చిన పత్తి పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి తుఫాన్ కారణంగా తడుస్తున్నదని, దీంతో తాము నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పత్తి నాణ్యతకు ముప్పు..

జిల్లాలో ఈ ఏడాది వానకాలంలో సుమారు 46,548 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. పంటలు ఎదుగుతున్న తరుణంలోనే వర్షాలు అధిక మొత్తంలో కురిసి దిగుబడిపై ప్రభావం చూపింది. రెండోసారి రైతులు పత్తితీయడం మొదలుపెట్టగా, వర్షాలు పడితే పంట నాణ్యత దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు.

కేంద్రాల్లోనే ధాన్యం..

రైతులు వడ్లను విక్రయించడానికి నానా తంటాలు పడాల్సి వస్తున్నది. ప్రభుత్వం, మిల్లర్ల మధ్య సయోధ్య కుదురుకపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభించారు. దీంతో ఎక్కువ మంది దళారులకే అమ్ముకున్నారు. మిగతా కొందరు కేంద్రాల్లో ధాన్యం పోయగా, తుఫాను కారణంగా వడ్లపై టార్పాలిన్లు కప్పి ఉంచారు. భారీ వర్షం పడితే.. ఇక అంతే సంగతి అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పత్తి పంటకు తీవ్రనష్టం..

నాకున్న ఐదెకరాలతో పాటు మరికొంత కౌలు తీసుకుని పత్తి సాగు చేసిన. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం గగనమైతాంది. మొదటిసారి పత్తి తీసినప్పుడు వర్షం పడడంతో పత్తి దళారులకే అమ్మిన. ప్రస్తుతం సీసీఐకి పత్తి తరలిస్తామంటే తుఫాను ప్రభావంతో చిరుజల్లులు పడుతున్నయి. దీంతో పత్తి నాణ్యత కోల్పోతున్నది. తేమశాతం వస్తాదో.. రాదేమోనని భయమైతాంది.

– కోల రాంప్రసాద్, యువరైతు, మామిడిపల్లి

కోనరావుపేటలోని కొనుగోలు కేంద్రంలో వడ్ల రాశులపై కప్పి ఉంచి టార్పాలిన్లు

సత్వర సేవలకే భరోసా కేంద్రం

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్3: బాధిత మహిళలు, చిన్నారులకు భరోసా కల్పించేందుకు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జగిత్యాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరోసా కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. న్యాయ సలహాలు, సైకలాజికల్ కౌన్సెలింగ్, విద్యాపరంగా తీసుకుంటున్న చర్యలు, నమోదవుతున్న కేసులను పరిశీలించారు.

ఈ రాణాకు ఏమైంది!

- నక్సల్స్ ఉద్యమంలోనూ చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేక స్థానం
- గతమెంతో ఘనం.. నేడు అభాసుపాలు
- మూడు నెలలుగా కానరాని ఎస్‌హెచ్‌వో
- అవినీతి ఆరోపణలు విధుల నిర్లక్ష్యమే కారణమా?

వేములవాడ/ చందుర్తి డిసెంబర్ 3: నక్సల్ ఉద్యమంలోనూ చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఒకప్పటి ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దులో అడవి ప్రాంతంతో కలిగి ఉన్న చందుర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించాలన్న, ప్రజలతో మమేకంకావాలన్నా అప్పటి పోలీసు అధికారుల ధైర్యసాహసాలు ఈ ప్రాంత వాసులకు ఇంకా గుర్తున్నాయ. ప్రజలకు రక్షణే ధ్యేయంగా పనిచేసిన అప్పటి పోలీసులు 1998లో శ్రీనివాసరావు వంటి సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి వీరమరణం పొందడమే ఇందుకు నిదర్శనం. 2004 లోనూ ప్రపంచ చరిత్ర పుటల్లో లిఖించే విధంగా సాయుధ నక్సలైట్లతో అప్పటి ప్రభుత్వం శాంతియుత చర్చలు నిర్వహిస్తున్న సమయంలోనూ కుక్కలగండి తండాలో పోలీసులు, నక్సల్స్ మధ్య కాల్పులు కూడా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనాన్ని కలిగించిన విషయం తెలిసిందే. ఇక కొచ్చగుట్ట ఎన్‌కౌంటర్, రుద్రంగిలో మహిళ తల తెగిపడడం లాంటి సంఘటనలతో అప్పటి పోలీసులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. ఇంత చరిత్ర కలిగిన ప్రస్తుత చందుర్తి పోలీసు సర్కిల్‌కు ప్రధానంగా ఉన్న చందుర్తి పోలీస్ స్టేషన్ ఆరోపణలు ఎదుర్కొంటూ కనీసం ఎస్‌హెచ్‌వోను కూడా నిలుపుకొనే స్థాయి లేకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది.

చందుర్తిలోని పోలీస్‌స్టేషన్ కార్యాలయం

మూడు నెలలుగా ఎస్‌హెచ్‌వోల దూరం

చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ సీహెచ్ శ్రీకాంత్ మూడు నెలల క్రితం ఆరోపణల మధ్య బదిలీఅయ్యారు. ఆ తర్వాత మరో ఎస్ఐకి పోస్టింగ్ వచ్చినా.. అభ్యంతరాల మధ్య బాధ్యతలు తీసుకోకుండానే వెనుతిరిగారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో పని చేస్తున్న మరో ఎస్ఐ కూడా ఇక్కడికి బదిలీ అయినట్లు సమాచారం. సదరు ఉద్యోగి కూడా ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపడం లేదని ఆరోపణలున్నాయి. ఏఎస్ఐ బాపుని ఇన్‌చార్జి అధికారిగా కొనసాగుతున్నాడు. అయితే ఇటీవలే ఓ ఫిర్యాదు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాడని బాధిత కుటుంబం వేములవాడ ఏఎస్పీ కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీస్‌బాస్ ఏఎస్ఐని హెడ్ క్వార్టర్‌కు అటాచ్డ్ చేశారు. అంతకు ముందు ఇక్కడ పని చేసిన కానిస్టేబుళ్లు భాస్కర్, రవి బదిలీ కాగా, ఆరోపణల నేపథ్యంలో మరో హెడ్ కానిస్టేబుల్‌పై కూడా వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఒకప్పటి చరిత్ర కలిగిన పోలీస్‌స్టేషన్.. ప్రస్తుతం ఎస్‌హెచ్‌వో లేకుండా మూడు నెలలుగా కొనసాగుతున్న తీరుపై పోలీస్ శాఖలో జోరుగా చర్చ కొనసాగుతోంది.

వన్య ప్రాణుల వధ

కోనరావుపేట, డిసెంబర్ 3: వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని వన్య ప్రాణులు విలవిల్లాడుతున్నాయి. ఆహారం కోసం పంటచేలకు వస్తుండడంతో వేటగాళ్ల ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చి వాటిని వధిస్తున్నారు. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా వాటి చర్మం, మాంసాన్ని కుప్పలు, కుప్పలుగా విక్రయించి సొమ్ములు కాసుకుంటున్నారు. ఇదే ఘటన మర్తనపేట శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగింది. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు, అటవీ జంతువులను వదిస్తున్న తీరును పలువురు వెల్లడించారు. మర్తనపేట శివారులోని క్రషర్ వద్ద ఉన్న చిన్నపాటి కుంట వద్ద దుప్పి, మనుబోతు, కొండగొర్రెలను చంపినట్లు సమాచారం. అయితే కొండపై నుంచి దాహం తీర్చుకునేందుకు కుంట వద్దకు వచ్చే వన్యప్రాణులను వధించేందుకు కరెంట్ షాక్‌లను వేటగాళ్లు బిగించారు. వారు బిగించిన కరెంట్ షాక్‌లకు చిక్కుకొని మృత్యువాత పడ్డాయి. వాటిని పక్కనే ఉన్న గుట్ట పైకి తీసుకువెళ్లి వేటగాళ్లు వాటిని అక్కడే సంహరించి మాంసంను కుప్పలుగా వేశారు. అనంతరం ధర్మారం, మర్తనపేటతో పాటు సిరిసిల్ల అర్బన్ మండలం బోనాలలో విక్రయించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు, అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లే సమయానికి వేటగాళ్లు అక్కడి నుంచి పరారయ్యారు. కానీ అక్కడే వేటగాళ్లు జంతువులను సంహరించిన రక్తపు మడుగులు, బంధించిన తాళ్లు, మాంసం ముక్కలుగా చేసేందుకు వినియోగించిన కర్ర, చెట్ల ఆకులను అక్కడే వదిలివెళ్లారు. కుంట ప్రాంతం నుంచి గుట్టపైకి పోలీసులు వెళ్లేసరికి అక్కడి నుంచి వేటగాళ్లు పారిపోయారు. బాధ్యులపై తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల

చందుర్తి, డిసెంబర్ 3: రామన్నపేట ప్రాథమికోన్నత పాఠశాల మందుబాబులకు అడ్డా గా మారింది. మండలంలోని పలు పాఠశాలకు ప్రహరీలు లేకపోవడంతో రాత్రి వేళలో మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలు, మిగిలిన తినుబండారాలను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. ప్రతి రోజూ ఉదయం పాఠశాలకు చేరుకునే టీచర్లు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో పడి ఉన్న మద్యం సీసాలతో ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



రామన్నపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బీరు సీసాలు

హలో.. నేను ఏఎస్ఐని మాట్లాడుతున్నా..!

- పోలీసునంటూ వ్యాపారికి రూ.90 వేలు బురిడీ
- వెల్గటూర్‌లో సైబర్ మోసం

వెల్గటూర్, డిసెంబర్ 3: 'హలో.. నేను ఏఎస్ఐని మాట్లాడుతున్నా తమ్మీ.. దుకాణం బందు చేసి ఉన్నది. నేను లిక్విడ్ క్యాష్ ఇస్తా. సీఐ కూతురుకు ఆరోగ్యం బాగాలేదు. పంపియ్యాలె' అని చెప్పి ఓ గుర్తు తెలియని వ్యక్తి మండలంలోని ఓ వ్యాపారికి రూ.90వేలు బురిడీ కొట్టించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పేటకు చెందిన హరీశ్ మండలకేంద్రంలో ఫెస్టిసైడ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. కాగా, సోమవారం సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి 'ఏఎస్ఐని మాట్లాడుతున్నా తమ్మీ.. దుకాణం బందు చేసి ఉన్నది. నేను లిక్విడ్ క్యాష్ ఇస్తాను. సీఐ కూతురుకు ఆరోగ్యం బాగాలేదు. పంపియ్యాలె' అని హరీశ్‌కు ఫోన్ చేసి నమ్మబలికాడు. దీంతో పూర్తి వివరాలు తెలుసుకోకుండా హరీశ్ 'నాకు తెలిసిన సార్లే.. డబ్బులు పది నిమిషాల్లో పంపిస్తారు. సార్ స్కానర్ పంపిస్తాడు. దానికి రూ.90 వేలు పంపించు' అని అతని దుకాణం ఎదురుగా ఉండే కిషన్‌రావుపేటకుచెందిన ఫర్టిలైజర్, ఎరువుల దుకాణం యజమాని బండారి తిరుపతికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో తిరుపతి తన అకౌంట్‌లో డబ్బులు లేకపోయినా ఎదురు దుకాణం యజమానే అడుగుతున్నాడు కదా.. అని తన ఊరికి చెందిన వరుసకు అన్న అయిన కుమ్మరి వెంకటేశ్‌కు ఫోను చేసి గుర్తు తెలియని వ్యక్తి పంపిన స్కానర్‌కు డబ్బులు పంపించాలని, తాను ఇంటికి వచ్చాక ఇస్తానని చెప్పాడు. దీంతో వెంకటేశ్ సదరు స్కానర్‌కు రూ.90 వేలు పంపించాడు. కానీ, 30 నిమిషాలైనా డబ్బులు ఎవరూ ఇవ్వలేదు. అనుమానం వచ్చిన తిరుపతి.. హరీశ్ పంపిన నంబర్‌కు ఫోను చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని గమనించి రాత్రి 9.30 గంటల ప్రాంతంలో వెల్గటూర్ పోలీసు స్టేషన్, సైబర్‌క్రైం వారికి ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 3: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ శాలీనాయక్ పేర్కొన్నారు. మెట్లచిట్టాపూర్ సబ్‌స్టేషన్‌లో రూ.68లక్షలతో నెలకొల్పిన అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం